


# మనం

చిత్తూరు | తిరుపతి

శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

4 పేజీలు





# శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

- తొలిరోజు శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయులు తెప్పపై విహారం





తిరుమల, ఫిబ్రవరి 26,మనం న్యూస్:తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు.ముందుగా సాయంత్రం 6 గంటలకు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ రామచంద్రుని ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు చేరుకుంది.తొలిరోజు శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి వారు పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులను ఆశీర్వదించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది.

**శ్రీవారి తెప్పోత్సవాల చరిత్ర**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతీ ఏడాది ఘనంగా నిర్వహించే ఐదు రోజుల తెప్పోత్సవాలను "తెప్ప తిరునాళ్లు"గా పిలుస్తారు. ఈ సందర్భంగా శ్రీవారు స్వామి పుష్కరిణిలో అలంకరించిన తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. జీవన సాగరంలో మునిగిపోకుండా భక్తులను రక్షించే దైవానుగ్రహానికి ఇది ప్రతీకగా భావిస్తారు. తెప్ప అనగా పడవ, ఓడ.ఓడలో సుఖాశీనులైన శ్రీవారిని కోనేటిలో విహారం చేయించడాన్నే తెప్పోత్సవం అంటారు. తిరుమలలో తెప్పోత్సవాలు అత్యంత ప్రాచీనకాలం నుండి జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ / చైత్ర మాసాల్లో (ఫిబ్రవరి–మార్చి) ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి.శ్రీ సాళువ నరసింహరాయలు క్రీ.శ 1468లో పుష్కరిణి మధ్యలో నీరాళి మండపాన్ని నిర్మించి తెప్పోత్సవాలకు అనువుగా తీర్చిదిద్దారు. ఆయన కుమారుడు పెద్ద తిరుమలయ్య పుష్కరిణి పునరుద్ధరణ చేపట్టి, స్వామి పుష్కరిణి – వరాహ పుష్కరిణిలను వేరు చేసినట్లు శాసనాల్లో పేర్కొనబడింది. క్రీ.శ.15వ శతాబ్దానికి చెందిన శ్రీ తాళ్లపాక అన్నమయ్య తిరుమల తెప్పోత్సవాలను గొప్పగా కీర్తించారు. మధ్యలో కొంతకాలం విరామం వచ్చినప్పటికీ, 1921లో తిరిగి ఈ ఉత్సవాలు పునరుద్ధరించబడ్డాయి.ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 28 న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జిల్లాకు రాక

- మార్చి 1 న దామినేడు వద్ద నూతన జిల్లా కోర్టు భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- పర్యటన ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్
- పటిష్ట భద్రత ఏర్పాట్ల ఉండేలా చూసుకోవాలి : ఎస్పీ

తిరుపతి, ఫిబ్రవరి 26 మనం న్యూస్: తిరుపతి జిల్లా దామినేడు వద్ద నూతనంగా నిర్మించనున్న జిల్లా కోర్టు భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొననున్న సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఫిబ్రవరి 28 న తిరుపతికి రానున్నారని, పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ అడిషనల్ జిల్లా జడ్జి గురునాథం, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ భూమి నాథన్, డి ఆర్ ఓ నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్ డి ఓలు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, డిఎస్పీ లతో కలిసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన ఏర్పాటులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 01 న దామినేడు దగ్గర నిర్మించనున్న నూతన జిల్లా కోర్టు కాంప్లెక్స్ భూమి పూజ కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాల్గొనన్ను నేపథ్యంలో తాజ్ హోటల్, కార్యక్రమం జరుగు ప్రాంతాలలో భద్రత, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, ఇతర సౌకర్యాలను పకడ్బందీ నిర్వహించాలని, పోలీసు, అగ్నిమాపక అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారుల సమన్వయంతో కట్టుదిట్టమైన బందోబస్తు, కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అగ్నిమాపక వాహకం, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. భూమి పూజకు ప్రధాన న్యాయమూర్తితో పాటు ఇతర అత్యున్నత న్యాయ మూర్తులు పాల్గొననున్నారని, నోడల్ అధికారులను నియమించడం జరుగుతుందని, చిన్నపాటి లోపాలకు తావు లేకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన లో పటిష్టమైన భద్రతతో పాటు ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటులను చేయాలన్నారు. భద్రతకు సంబంధించిన నోడల్ అధికారులు నియమించడం జరుగుతుందన్నారు. సమీక్ష అనంతరం దామినేడు నందు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జిల్లా కోర్టు సముదాయానికి భూమి పూజ చేయనున్న నేపథ్యంలో ఎస్పీ సుబ్బరాయుడు, సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లును పర్యవేక్షించి పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్.

ఈ కార్యక్రమంలో తుడా సెక్రెటరీ, శ్రీకాంత్, ఈ ఈ రవీంద్ర, సంబంధిత జిల్లా అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, తాసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు..

# బాధితుల ఇంటి గడప వద్దకే వెళ్లి చెక్కుల పంపిణీ..

- బాధిత కుటుంబాలకు అండగా బొజ్జల కుటుంబం...
- మానవత్వం చాటుకున్న బొజ్జల రిషిత రెడ్డి
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముమ్మరంగా సాగిన ఆర్థిక సాయం అందజేత....




రేణిగుంట మనం ఫిబ్రవరి 26: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి నేడు మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ, వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు కుటుంబాలకు ఆమె భరోసానిచ్చారు. రేణిగుంట, ఏర్పేడు మరియు శ్రీకాళహస్తి రూరల్ మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని రిషిత రెడ్డి స్వయంగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు.సాధారణంగా లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, బాధితుల పరిస్థితిని అర్థం చేసుకుని నేరుగా వారి ఇంటి గడప వద్దకే వెళ్లి సాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె బాధితుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. బొజ్జల కుటుంబం ఎప్పుడూ ప్రజల కష్టసుఖాల్లో తోడుంటుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని బాధితులకు అండగా నిలిచారు.

# "యాదవ సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం...

- చిత్ర యూనిట్కు హెచ్చరిక"...
- జాతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్.



రేణిగుంట, మనం ఫిబ్రవరి 26. "యాదవ్ జీ కి లవ్ స్టోరీ" అనే చిత్రంలో యాదవ సమాజం పేరును ఉపయోగిస్తూ, ఆ సామాజిక వర్గ గౌరవ ప్రతిష్టలను దెబ్బతీసేలా చేసిన ప్రయత్నాన్ని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ రేణిగుంటలో ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ చిత్ర యూనిట్ కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఏ ఒక్క సమాజాన్ని లేదా కులాన్ని ప్రతికూలంగా చూపించడం భారత రాజ్యాంగ విలువలకు మరియు సామాజిక ఐక్యతకు పూర్తిగా విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా యాదవ సమాజంలోని మహిళలు, కుమార్తెల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా సన్నివేశాలను చిత్రీకరించడం ఏమాత్రం అంగీకరించలేని విషయమని, ఇది రెండు సామాజిక వర్గాల మధ్య విద్వేషం సృష్టించే కుట్రగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పూల వెంకటాద్రి యాదవ్ చిత్ర యూనిట్ ముందు పలు స్పష్టమైన డిమాండ్లను ఉంచారు. సినిమా శీర్షికలో ఉన్న కులం పేరును తక్షణమే తొలగించాలని, అలాగే సమాజ ప్రతిష్టను మసకబార్చే విధంగా ఉన్న అన్ని సన్నివేశాలను, సంభాషణలను సినిమా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చిత్రాలు తీయకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తాము రాజ్యాంగ పరిరక్షణలో పూర్తి విశ్వాసం ఉంచుతున్నామని, ఒకవేళ ప్రభుత్వం మరియు చిత్ర యూనిట్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే, యాదవ సమాజ గౌరవాన్ని కాపాడుకోవడం కోసం దేశవ్యాప్తంగా చట్టబద్ధమైన ఉద్యమం చేపట్టడం తప్ప తమకు మరో మార్గం ఉండదని హెచ్చరించారు. సామాజిక ఐక్యతను కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని, యాదవ సమాజ ఆత్మగౌరవం తమకు ప్రాణ సమానమని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



## టీటీడీ చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 26,మనం న్యూస్:టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడును టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా టీటీడీ ఈవోను, చైర్మన్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.



## బాల్య వివాహం ఒక సామాజిక అనర్థం - తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన "బాల్ వివాహ్ ముక్తి రథ్" కార్యక్రమానికి మద్దతు కోరుతూ సంస్థ ప్రతినిధులు తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. దేశవ్యాప్తంగా భారత ప్రభుత్వం మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న 100 రోజుల సుదీర్ఘ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందని వారు వివరించారు. జిల్లాలో 30 రోజులపాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవగాహన రథం ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, బాలల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ, "బాల్య వివాహం ఒక సామాజిక అనర్థం మాత్రమే కాదు, అది బాలల భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సమస్య. ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం మనందరి బాధ్యత. 2030 నాటికి బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే జాతీయ లక్ష్యానికి అనుగుణంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరం. ఈ కార్యక్రమానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు.

## రైతు పక్షపాతికి దక్కిన గౌరవం....

- కిసాన్ మోర్చా రాష్ట్ర ఇంచార్జిగా కోలా ఆనంద్ నియామకం..
- శుభాకాంక్షలు తెలిపిన మండల ఉపాధ్యక్షులు రాజా రాయల్



రేణిగుంట మనం ఫిబ్రవరి 26. భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ మోర్చా ఇంచార్జిగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ నియమితులైన సందర్భంగా రేణిగుంట మండల ఉపాధ్యక్షులు రాజా రాయల్ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న కోలా ఆనంద్ కి ఈ కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం కోసం ఆనంద్ చేస్తున్న పోరాటాలకు ఈ పదవి దక్కిన గౌరవమని, రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో కిసాన్ మోర్చా రాష్ట్రవ్యాప్తంగా అద్భుతమైన ప్రగతి సాధిస్తుందని రాజా రాయల్ ఆకాంక్షించారు. కోలా ఆనంద్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ ఆయనకు అభినందనలు తెలిపారు.




## సస్యరక్షణ చర్యల పై రైతులకు శిక్షణా కార్యక్రమం

శాంతిపురం మండలం ఫిబ్రవరి 26 మనం న్యూస్అ :రటి మరియు బొప్పాయి పంట లో సస్యరక్షణ చర్యల పై రైతులకు శిక్షణా కార్యక్రమం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో అరటి లో ఎక్కువగా పనామా తెగులు, సిగటోక ఆకు మచ్చ తెగులు ఆశిస్తుంది. పనామా తెగులు లో ముందుగా ఆకులు పసుపు రంగులోకి మారి , కాండం నిలువుగా చీలడం , కాండం లోపల కుళ్ళడం కనిపిస్తుంది. ఇది ముఖ్యంగా రోగం ఆశించిన దుంపలనే వాడడం వలన వ్యాప్తి చెందుతుంది. దీని నివారణ కోసం రైతులు కేవలం టిష్యూ కల్చర్ మొక్కలనే నాటాలి. జీవన ఎరువులైన ట్రైకోడెర్మా , సుడోమోనాస్ జెల్ రూపంలో దొరికే దానిని 100 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి డ్రిప్ ద్వారా వదలాలి ఇలా జీవన ఎరువులను వాడేటప్పుడు 2 రోజులు ముందు ఆ తర్వాత 2 రోజులు రసాయన ఎరువులు వాడకూడదు. అరటి లో ముఖ్యంగా నీటి యాజమాన్యం మరియు ఎరువుల యాజమాన్యం మోతాదుకు అంటే ఎక్కువగా అసలు వాడకూడదు. గెలలు బయటకి వచ్చిన తర్వాత 0- 0- 50 కు 5గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే గెలల నాణ్యత పెరుగుతుంది. అలాగే గెలలకు కవర్లను తొడగడం వలన కూడా మంచి నాణ్యత వస్తుందని దీని కోసం ఉద్యాన శాఖ అరటి రైతులకు సబ్సిడీ లో వీటిని అందిస్తున్నారని తెలియజేశారు. ఉద్యాన శాఖ తరపున అందిస్తున వివిధ పథకాలను గురించి తెలియజేసి రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఉద్యాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎం ఎల్ సి గౌనివారి శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, కుప్పం ఉద్యాన సహాయ సంచాలకులు పల్లవి, ఉద్యాన అధికారులు వింధ్య మరియు డింపు ప్రియ, మార్కెటింగ్ డైరెక్టర్లు హరినాథ్ రెడ్డి, చంద్రకళ , రైతు సేవా కేంద్ర సిబ్బంది, అరటి మరియు బొప్పాయి రైతులు పాల్గొన్నారు.

# మార్చి 5న రాష్ట్ర వ్యాప్తంగా 'విధాత' గ్రాండ్ రిలీజ్

- నిర్మాత డా. అప్పినపల్లి భాస్కరాచారి
- దర్శకుడు మణికంఠ రాజేంద్ర వెల్లడి






కురబలకోట, ఫిబ్రవరి 26, మనం న్యూస్ :స్థానిక ప్రతిభకు రాష్ట్ర స్థాయి వేదికగా నిలుస్తూ 'విధాత' చిత్రం మార్చి 5న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఏబిసి ప్రొడక్షన్ బ్యానర్ పై తెరకెక్కిన ఈ తొలి చిత్రం పట్ల సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి నిర్మాతగా, కథానాయకుడిగా వ్యవహరించిన డా. అప్పినపల్లి భాస్కరాచారి తన సాహసోపేత నిర్ణయంతో స్వయంగా సినిమాను విడుదల చేయడానికి ముందుకొచ్చారు. దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ బాధ్యతలను మణికంఠ రాజేంద్ర బాబు నిర్వహించారు.మదనపల్లె కేంద్రంగా స్థానిక ప్రతిభావంతులైన నటీనటులతో రూపొందిన ఈ చిత్రం బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాల్లో కూడా చిత్రీకరణ జరుపుకుంది. ఇప్పటికే సెన్సార్ ప్రక్రియ పూర్తి చేసుకున్న ఈ సినిమా కుటుంబ సమేతంగా వీక్షించదగిన సందేశాత్మక చిత్రమని దర్శక, నిర్మాతలు తెలిపారు.భావోద్వేగం, సందేశం మేళవింపు'విధాత' కథ ఒక సాధారణ రైతు కూలీ జీవితం చుట్టూ తిరుగుతుంది. కుటుంబాన్ని కోల్పోయిన అనంతరం అతడు ఎదుర్కొన్న కష్టాలు, జీవితంలో తిరిగి నిలబడిన తీరు, తనకు అన్యాయం చేసిన వారికి గుణపాఠం చెప్పిన విధానం ఇవన్నీ సమాజానికి స్పష్టమైన సందేశాన్ని అందించేలా తెరకెక్కించబడినట్లు చిత్రబృందం వెల్లడించింది.హైదరాబాద్ లో నిర్వహించిన ప్రీమియర్ షోలో సినీ పరిశ్రమ ప్రముఖుల నుండి ప్రశంసలు, అభినందనలు వెల్లువెత్తినట్లు నిర్మాత పేర్కొన్నారు. పాటలు, ఫైట్స్, హాస్యంతో పాటు అద్భుతమైన సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు.కథా రచన అప్పలబట్ల సురేష్ అందించగా, గాయకులు సింధూజా శ్రీనివాస్, సురేష్ పాటలకు స్వరం అందించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు హైదరాబాద్ లో పూర్తి చేశారు.మదనపల్లె ఖ్యాతిని చాటే ప్రయత్నంమదనపల్లె నుంచి ఏబిసి ప్రొడక్షన్ స్థాపించి, స్థానిక నటీనటులతో రాష్ట్రవ్యాప్తంగా సినిమా విడుదల చేయడం ఒక సాహసోపేత అడుగుగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రేక్షకులు ఆదరిస్తే భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు నిర్మించి, కొత్త నటులకు అవకాశాలు కల్పిస్తామని నిర్మాత డా. అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు.కుటుంబ సమేతంగా చూసేలా రూపొందిన 'విధాత' చిత్రాన్ని మార్చి 5న థియేటర్లలో వీక్షించి ప్రోత్సహించాలని చిత్రబృందం కోరింది.

# విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- త్వరలో ఐటిఐ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుంది
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార



(చిత్తూరు/ విజయపురం, ఫిబ్రవరి 26 మనం న్యూస్):త్వరలో ఐటిఐ కళాశాలకు కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుంది అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, గురువారం విజయ పురం మండలంలో ప్రధాన కేంద్రంలో ఉన్న ఐటిఐ కళాశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఐటిఐ లో, ఎలక్ట్రికల్, పిట్టర్, ఆటోమొబైల్, మోటార్ మెకానిక్, కార్పెంటర్, సివిల్ ట్రేడ్ లను , డీజిల్ మెకానిక్ వివిధ సెక్షన్లోనూ జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి, ఈ కోర్సులు సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు, తల్లిదండ్రులు మీ పైన ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారని వారి ఆశయాలను మీరు నెరవేర్చాలని తెలిపారు ఈ కళాశాలకు కావలసిన అన్ని మౌలిక వసతులు త్వరలో పూర్తి చేస్తామని అందుకు సంబంధించిన నిధులు ఎంత మేర అవసరమో నివేదికలు అందజేయాలని కలెక్టర్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు.శిక్షణ నాణ్యతను మెరుగుపరచి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారుఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కాలభైరవ, లెక్చరర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ వైపు అడుగు వేస్తే అది.. జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది

- కుప్పం రూరల్ ఎస్సైరామకృష్ణ







కుప్పం ఫిబ్రవరి26 మనం న్యూస్: కుప్పం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్ అనే మహమ్మారిపై గట్టిగా గళమెత్తుతూ జడ్పిహెచ్ పొన్నంగురు లో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు భారతి గారి ఆధ్వర్యంలో దృఢ సంకల్పంతో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుప్పం రూరల్ ఎస్సై రామకృష్ణ మరియు ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు ఎంపీ ప్రకాష్ హాజరై విద్యార్థుల్లో చైతన్యం నింపారు.ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ వైపు అడుగు వేస్తే అది జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుందని, ఆరోగ్యం నాశనం అవుతుందని, కుటుంబ గౌరవం కోల్పోతారని, చట్టపరమైన కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. "ఒక్క తప్పు నిర్ణయం మీ భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీస్తుంది" అని హెచ్చరించారు.ఎంపీ ప్రకాష్ గట్టిగా మాట్లాడుతూవిద్యార్థులారా... బాధ్యత లేకుండాతిరిగితేభవిష్యత్తుమసకబారుతుంది. కానీ క్రమశిక్షణతో చదివితే మీరు ఎదుగుదల శిఖరాలు అధిరోహిస్తారు. మీ తల్లిదండ్రుల కలలు నెరవేర్చే బాధ్యత మీదే" అని పిలుపునిచ్చారు.రాబోయే ఎస్ .ఎస్ .ఎల్ .సి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భయపడకుండా ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ద్వారా "డ్రగ్స్ కు నో చెప్పాలి చదువుకు యెస్ చెప్పాలి" అనే సందేశం ఘనంగా వినిపించబడింది.ప్రధాన ఉపాధ్యాయులు,బృందం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంజీవని ప్రాజెక్ట్ సమర్ధవంతంగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**





(చిత్తూరు, ఫిబ్రవరి 26 మనం న్యూస్):- సంజీవని ప్రాజెక్ట్ సమర్థవంతంగా అమలు చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, గురువారం స్థానిక కలెక్టరేట్లోనే సమావేశ మందిరంలోపలమనేరు నియోజకవర్గానికి చెందిన డాక్టర్లతో నాల్గవ సమావేశం నిర్వహించి, డిజిటల్ నర్స్ సెంటర్ మరియు "సంజీవిని" ప్రాజెక్ట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూసంజీవిని సెంటర్ ద్వారా ఓపీ సేవలు, ఇంటి వద్ద నుంచే నియామక సేవలు (హోమ్ అపాయింట్మెంట్ సర్వీసులు), అలాగే రిఫరల్ సేవలు అందించబడతాయని పేర్కొన్నారు. ఈ సేవలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ వీటిని వినియోగించుకునేలా చూడాలని సూచించారు.అలాగే వైద్య సేవల నాణ్యత మెరుగుపరచడానికి "టైమింగ్ ఫాలోఅప్" తప్పనిసరిగా చేయాలని తెలిపారు. PCC తో సమన్వయం చేసుకుని అన్ని లాగిన్లను ( health X app )విశ్లేషిస్తూ రెగ్యులర్ మానిటరింగ్ నిర్వహించాలని ఆదేశించారు.రోగుల ఫాలో-అప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి డాక్టర్ సరైన మరియు పూర్తి డేటాను అన్ని లాగిన్లలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ డేటా భవిష్యత్తులో వ్యాధుల విశ్లేషణకు, ఆయా ప్రాంతాల్లో వ్యాధి తీవ్రత (Disease Burden) అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే హాట్ స్పాట్స్ గుర్తించడంలో కూడా ఇది ఎంతో కీలకమని చెప్పారు.మంచి డాక్టర్లుగా ఫాలో-అప్ ప్రోగ్రామ్ ను సమర్థవంతంగా అమలు చేసి, భవిష్యత్ వైద్యులకు కూడా ఉపయోగపడే విధంగా డేటాను నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.టి. సుధారాణి, డాక్టర్ వెంకటప్రసాద్,డాక్టర్ ప్రవీణ, కోఆర్డినేటర్ ప్రసాద్ మరియు వివిధ పీహెచ్ సీ డాక్టర్లు పాల్గొన్నారు.

# టీటీడీ ఆస్తులకు వారసులను సృష్టిస్తారా?

- పీఠాధిపతులతో ఓంకార్




తిరుపతి ప్రెస్ క్లబ్ జనవరి 26 మనం న్యూస్ : తిరుమల షాపుల విషయంలో ఒక వ్యక్తికి,ఒకే కుటుంబానికి రెండు మూడు షాపులు ఎలా కేటాయిస్తారు అని, అది చట్ట విరుద్ధం కాదా?టెండర్ గడువు ముగిసినా టీటీడీ అధికారులు 84 దుకాణాలను స్వాధీనం చేసుకోకుండా,వాటికి పబ్లిక్ వేలం నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని శివ కామేశ్వరి స్వామి పీఠాధిపతి శివానంద స్వామి గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు.టీటీడీ బోర్డు తీర్మానాలను ఉల్లంఘిస్తున్న అధికారులు,తిరుమల ఎస్టేట్ ఆఫీసర్ పై అనుమానం కలుగుతుందని చెప్పారు. తుమ్మా ఓంకార్ మాట్లాడుతూ గతంలో మేము టీటీడీ ఈఓ,అదనపు ఈఓ కిగత సంవత్సరం నవంబర్ 13,20న ఫిర్యాదులు చేశామని వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.40 సంవత్సరాలుగా టెండర్లు లేకుండా దుకాణాల కొనసాగింపు,1976 నుండి వేలం దుకాణాలు అదే కుటుంబాలు,వారసుల పేర్లతో కొనసాగుతున్నాయని,ఇది ఎండోమెంట్స్ చట్టం,టీటీడీ నియమాలకు వ్యతిరేకం అన్నారు.అక్రమ అమ్మకాలు సబ్-లీజులు,కొంతమంది లైసెన్సులు,టీటీడీ దుకాణాలను కొన్ని లక్షలు తీసుకొని అక్రమంగా బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యల వలనటీటీడీకి భారీ ఆర్థిక నష్టం వ స్తుంద న్నారు. వార స త్వ కొన సాగింపు, చ ట్ట విరుద్ధం అని,1976లో కేటాయించిన దుకాణాలు ఇప్పటికీ వారసుల చేతిలోనే ఉన్నాయి పేర్కొన్నారు.టీటీడీ నిబంధనల్లో వారసత్వ హక్కు అనుమతించబడదని అధికారులు గుర్తించకపోవడం ఏంటి అని ప్రశ్నించారు.84 షాపులు- 57కి తగ్గించడం పై అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు.మొదట 84 వేలం షాప్స్ ఉన్నట్లు రికార్డులలో ఉంటే,ప్రస్తుతం 57 షాప్స్ ఉన్నట్లు పేర్కొనడం,మిగిలిన 20 షాప్స్ పట్ల అనుమనం వుంది అన్నారు.ఎండోమెంట్స్ రూల్స్,1990,147 లీజ్ 3 సంవత్సరాలు మాత్రమే ఉంటాదని,ఈఓ అనుమతి లేకుండా సబ్-లీజ్ నిషేధం అని పేర్కొన్నారు.స్వామి వారి ఆస్తుల పరిరక్షణ కోసం మహా ఉద్యమం చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో శివకామేశ్వరి పీఠం పీఠాధిపతి శివానంద స్వామి, రుద్రగిరి స్వామి,తిరు క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మ ఓంకార్,జై హిందూస్తాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, నీలకంఠ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## వినాయక స్వామిని దర్శించుకున్న నీటిపారుదలశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ లీలా కృష్ణ

పూతలపట్టు కానిపాకం ఫిబ్రవరి 26 మనం న్యూస్: వరసిద్ధి వినాయక స్వామిని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ లీల కృష్ణ గురువారం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారుస్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు ఈ కార్యక్రమంలో డీఈఓ సాగర్ బాబు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శివ ప్రసాద్, సూపరిడెంట్ వాసు, తదితరులు ఉన్నారు.

## వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదానము నకు విరాళం -1,00,216/-రూ దాత



పూతలపట్టు కాణిపాకం ఫిబ్రవరి 26 మనం న్యూస్: శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదాన పథకానికి గురువారంభో జనంపాటి కస్తూరిమ్మ విరాళం అందించారు వారి కుటుంబ సభ్యులు, తిరుపతి వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ సూపరిడెంట్ వాసు, మాజీ చైర్మన్ మోహన్ నాయుడు, తదితరులు ఉన్నారు.

## తిరుపతి జిల్లా కోర్టు స్థలాన్ని పరిశీలించిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



తిరుపతి, ఫిబ్రవరి 26,మనం న్యూస్:తిరుపతి జిల్లా కేంద్రంలో నిర్మించతలపెట్టిన నూతన జిల్లా న్యాయస్థానాల భవన సముదాయ స్థలాన్ని తుడా చైర్మన్,టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి గురువారం తుడా మరియు రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.న్యాయ వ్యవస్థకు కావాల్సిన అన్ని హంగులతో, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల మేరకు తిరుపతిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. అందులో భాగంగానే జిల్లా కోర్టుల నిర్మాణం పారదర్శకంగా, పటిష్టంగా జరిగేలా తుడా పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.కోర్టు సముదాయం కోసం కేటాయించిన భూమిని క్షుణ్ణంగా పరిశీలించి, భవన నిర్మాణ ప్లాన్, ఎంట్రీ మరియు ఎగ్జిట్ పాయింట్లపై అధికారులతో చర్చించారు.భవిష్యత్తులో పెరిగే ట్రాఫిక్ ను దృష్టిలో ఉంచుకుని, వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా శ్రీకాంత్ బాబు, ఎస్ ఈ రవీంద్రయ్య ఇతర ఉన్నతాధికారులు మరియు ఇంజనీరింగ్ విభాగం,గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## మార్చి నెలలో తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జరుగనున్న పలు విశేష ఉత్సవాలు



తిరుపతి, ఫిబ్రవరి 26,మనం న్యూస్:మార్చి 3న చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ గోవింద రాజ స్వామి ఆల యం మూత. మార్చి 5న ఉత్తరా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు. మార్చి 6, 13, 20వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆలయ మాడవీధుల్లో శ్రీ ఆండాళ్ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. మార్చి 15న శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. మార్చి 16న శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఉగాది సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం. మార్చి 19న ఆలయంలో ఉగాది ఆస్థానం. మార్చి 24న రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ పార్థసారధిస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు అభయమిస్తారు. మార్చి 26 నుండి ఏప్రిల్ 1వ తేదీ వ ర కు పంగుణి ఉత్తర ఉత్సవం. మార్చి 27న శ్రీరామ నవమి.

## బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం




చంద్రగిరి, ఫిబ్రవరి 26 మనం న్యూస్ : 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్' సాధనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం చంద్రగిరిలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బొల్లినేని కుసుమ మరియు డాక్టర్ రాసినేని శిరీష మరియు సి.డి.పి.ఓ పి.ఆర్. ప్రదీప పాల్గొని, అంగన్ వాడీ టీచర్లు, ఏఎన్ఎం లు మరియు ఎం.ఎల్.హెచ్.పి లకు బాల్య వివాహాల నిర్మూలనపై దిశానిర్దేశం చేశారు.

నవంబర్ 27 నుండి మార్చి 8, 2026 వరకు సాగే ఈ ప్రచారంలో భాగంగా, బాల్య వివాహాలను ఎలా అడ్డుకోవాలి, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన ఎలా కల్పించాలి మరియు ఈ ప్రక్రియలో ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల పాత్ర ఎంత కీలకమో వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్త...



## ద్యార్థిని విద్యార్థులకు పరీక్ష పరికరములు వితరణ

▪ ముఖ్యఅతిథిగా నియోజకవర్గం యువత అధ్యక్షులు కిషన్ చందు

వెదురుకుప్పం. మనం న్యూస్ ఫిబ్రవరి 26: వెదురుకుప్పం మండల ఆళ్లమడుగు ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పరీక్షలు సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష పరికరములను వితరణ ఇచ్చిన నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు గురుసాల కిషన్ చంద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందరిసన్, ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్ రెడ్డి, జనసేన నాయకుడు నలిపిరెడ్డి మధుసూదన్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు తంగవేలు, నలిపిరెడ్డి ఢిల్లీ ప్రసాద్ రెడ్డి, కానాల తిరుమలరెడ్డి, బోడిరెడ్డి లోకేష్, బోడిరెడ్డి సిద్దు మరియు జనసేన మోహన్, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంగరంగ వైభవంగా మహా కుంభాభిషేకం.బాబాను దర్శించుకున్న

▪ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు.



పీలేరు ఫిబ్రవరి 26 మనం న్యూస్: పీలేరు పట్టణంలో శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం మహా కుంభాభిషేకం దత్తాత్రేయ విగ్రహప్రాణ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట శాంతి హోమం పూర్ణాహుతి నిర్వహించి దత్తాత్రేయకు పాలాభిషేకం ప్రత్యేక పూజలు చేసి కలశాలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయిబాబాకు అభిషేకం చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరణ. బంగారు కిరీటాని ధరింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాద అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనను ఆలే కమిటీ సభ్యులు దుశాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా మనం న్యూస్ తో ఆలయ అధ్యక్షులు డాక్టర్ ఎం మల్లికార్జున మాట్లాడుతూ భక్తులు దాతల సహాయంతో గ్రామప్రజల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చేపడతామని 23వ సంవత్సర మహా కుంభాభిషేకాన్ని విజయవంతంచేసిన కమిటీ సభ్యులకు భక్తులకు దాతలకు గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుగ్గారెడ్డి రామచందర్ రెడ్డి పచ్చర్ల వెంకటరమణ రంగయ్య ప్రతాపరెడ్డి జ్ఞానం గారి శ్రీధర్ బలుసా వేణుగోపాల్

## పరిశ్రమల ఏర్పాటుకు భూములను పరిశీలించిన జెసి..ఆర్డిఓ.. ఏపీఐఐసి జెడ్ ఎం



స్ ఆర్ పురం ఫిబ్రవరి 26 మనం న్యూస్.. ఎస్ఆర్ పురం మండలం లోని గురువారం 56 కనికాపురం పాతపాలెం జిఎంఆర్ పురం రెవిన్యూ గ్రామాల్లో ఉన్న భూములను పరిశ్రమల ఏర్పాటుకు భూములను చిత్తూరు జెసి ఆదర్శ్ ఆర్ డి ఓ శ్రీనివాసులు ఏపీ ఐఐసి సుబ్బారావు గురువారం భూములు పరిశీలించారు...ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పురం తాసిల్దార్ లోకనాథ పెళ్లై,రెవిన్యూ ఇన్స్పెక్టర్ వి ఎస్ మహేష్,సర్వేర్ సురేష్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు..

## సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలి..

▪ బోడి రెడ్డి పూర్ణ ప్రకాష్ రెడ్డి



ఎస్ఆర్ పురం ఫిబ్రవరి 26 మనం న్యూస్.. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని బోడి రెడ్డిపూర్ణ ప్రకాష్ రెడ్డి అన్నారు గురువారం ఎస్ఆర్ పురం మండలం మంగుంట ఆది ఆంధ్ర వాడ గ్రామానికి చెందిన మాతయ్య సతీమణి విమలమ్మఅనారోగ్యంతో వారం క్రితం మృతి చెందింది.. గురువారం మాతయ్య భార్య విమలమ్మ ఉత్తర క్రియల సందర్భంగా మాతయ్యకుటుంబానికి బోడి రెడ్డి చిన్న స్వామి రెడ్డి కుమారుడు బోడి రెడ్డి పూర్ణ ప్రకాష్ రెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా బోడి రెడ్డి పూర్ణ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంగుంట ఆది ఆంధ్ర వాడ గ్రామానికి చెందిన మాతయ్య విమలమ్మ కుమార్తెలకు అండగా నేనుంటానని వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని బోడి రెడ్డి పూర్ణ ప్రకాష్ రెడ్డి తెలియజేశారు..ఈ కార్యక్రమంలో బోడి రెడ్డి పూర్ణ ప్రకాష్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం ఒక భక్తుడి మృతి..

▪ మరొకరికి గాయాలు..





తిరుమల, ఫిబ్రవరి 26,మనం న్యూస్: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో విషాదం చోటుచేసుకుంది. శ్రీవారి దర్శనం ముగించుకుని తిరిగి వెళుతున్న ఇద్దరు భక్తులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైంది.ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడులోని అరక్కోణం తాలుకా మిట్టపిట్ట గ్రామానికి చెందిన నటరాజన్, మునిరత్నం బైక్‌పై తిరుమల వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్డులోని అత్యంత ప్రమాదకరమైన 30వ మలుపు వద్దకు రాగానే వారి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పిట్టగోడను బలంగా ఢీకొట్టింది.ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావంతో నటరాజన్ ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే పోలీసులకు, టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. మునిరత్నంను 108 అంబులెన్స్‌లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు.

## జనసేన సభ్యత్వంలో తిరుపతిని మొదటి స్థానంలో నిలుపుతాం: ఆరణి మదన్



జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్యాలయ ఆవరణలో ఆరణి మదన్ గురువారం ఉదయం ప్రారంభించారు. ఆరణి మదన్ తన సభ్యత్వాన్ని రెన్యూల్ చేసుకుని సభ్యత్వాన్ని ప్రారంభించారు. జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, వీరమహిళలు, సాదక్ లు కీలకంగా వ్యవహరించాలని ఆరణి మదన్ కోరారు. రెన్యూవల్స్ తోపాటు కొత్త సభ్యత్వంతో పార్టీని ప్రజలకు చేర్చాలని ఆయన సూచించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు ఇంటింటికి తీసుకెళ్ళడంతోపాటు క్షేత్రస్థాయిలోని సమస్యలు తెలుసుకోవాలని ఆయన కోరారు. 2023లో నాలుగువేల నూట ఇరవై నాలుగు మంది సభ్యత్వం తిరుపతిలో ఉంటే 2025 నాటికి పదహారు వేల అరవై ఐదు మందికి చేరి రాయలసీమలో మొదటి స్థానంలో నిలిచిందని ఆయన వివరించారు. జెన్ జీ తరాన్ని పార్టీకి చేరువ చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ఉద్యమి కి ఐదు లక్షల భీమా సౌకర్యం పార్టీ కల్పించి వారి కుటుంభ సభ్యులకు భరోసా ఇస్తున్నదని ఆయన చెప్పారు. ఉద్యమి సహజ మృతికి లక్ష రూపాయలు, చిన్న ప్రమాదానికి యాభై వేలు, ప్రమాద తీవ్రత ఎక్కువుగా ఉంటే రెండు లక్షలు భీమా లభిస్తుందని ఆయన వివరించారు. పార్టీ నాయకత్వంలో కానీ, నామినేటర్ పదువల్లో ఇకపై సభ్యత్వం ఉన్న వారికే దక్కుతాయని ఆయన తెలిపారు. మార్చి పదవ తేదీ వరకు జరిగే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని జనసేనశ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతంలో ప్రదాత లు కూడా ఎంతో ముఖ్యమని ఉమ్మడి జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. సభ్యత్వ నమోదులో తిరుపతిని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. జనసేన బలోపేతానికి రెన్యూవల్స్ తోపాటు కొత్త సభ్యత్వం ఎక్కువుగా చేసేందుకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

▪ వారం పాటు భద్రత అవగాహనా కార్యక్రమాలు, పోటీలు




శ్రీసిటీ, ఫిబ్రవరి 26, మనం న్యూస్ :55వ జాతీయ భద్రతా వారోత్సవాలు గురువారం శ్రీసిటీలో ప్రారంభమైంది. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ జెండా ఊపి లాంఛనంగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీ సిబ్బంది మరియు స్థానికులకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి, వారిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో.. యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాలు నివారించడానికి భద్రతా అంశాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే ఈ భద్రతా వారోత్సవాల లక్ష్యం అన్నారు. పని ప్రదేశాలలో అధికశాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తాయన్న ఆయన, దీనిని నివారించేందుకు శ్రీసిటీ, పరిశ్రమలు కలసి తరచూ తమ ఉద్యోగులు, కార్మికులకు భద్రత పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రతా వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహనా కార్యక్రమాలతో పాటు భద్రత ప్రధానాంశంగా శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4 న ముగింపు ఉత్సవం జరుగుతుందన్నారు

## వేసవికాలంలో తీర్థయాత్రికుల కోసం ప్రత్యేక "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు".



తిరుపతి, ఫిబ్రవరి 26, మనం న్యూస్ :తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేకంగా "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ప్యాకేజీలను ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం IRCTC ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి 2026 మార్చి 21 నుంచి జూన్ 3 వరకు మొత్తం నాలుగు ప్రత్యేక యాత్ర ప్యాకేజీలను నిర్వహిస్తున్నట్లు ఐఆర్ సీటీసీ ఏరియా మేనేజర్ ఎన్. అశోక్ కుమార్ తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

1) దివ్య దక్షిణయాత్ర – జ్యోతిర్లింగ దర్శనం:తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు దర్శనాలు.యాత్ర కాలం: 21–28 మార్చి 2026, 24–31 మే 2026 (8 రోజులు)టికెట్ ధర (స్లీపర్): ₹14,700/-2) సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (11 రోజులు:ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్), ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్, పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గ్రిష్ణేశ్వర్ తేదీలు: 14–24 ఏప్రిల్ 2026) అయోధ్య – కాశీ – బైద్యనాథ్ ధామ్ యాత్ర:పూరి, కోణార్క్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య, ప్రయాగ్రాజ్ దర్శనాలు.యాత్ర కాలం: 8 రోజులుదీలు: 28 ఏప్రిల్–5 మే 2026, 3–12 జూన్ 2026, రైల్వే స్లీపర్ క్లాస్ టికెట్ ధర ₹16,700/-4) హరిద్వార్ – మాతా వైష్ణోదేవి – రిషికేష్ యాత్ర:మథుర, బృందావనం, వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేష్ దర్శనాలు.తేదీలు: 12–21 మే 2026టికెట్ ధర (స్లీపర్): ₹16,500/-సౌకర్యాలు: రైలు ప్రయాణం, బస్సు రవాణా, హోటల్ వసతి, రోజుకు మూడు భోజనాలు, వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్, ఉచిత స్థానిక రవాణా, ప్రయాణ బీమా, సీసీటీవీ, సెక్యూరిటీ గార్డులు. ఒక్కో రైలులో 705 మంది, ప్రతి 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు. రైల్ టికెట్లు బుకింగ్: 9281495853, 828793231,www.irctctourism.com

## పుంగనూరు న్యాయస్థానం ఏజీపీగా చౌడేపల్లి పట్టణానికి చెందిన బూరగల సురేష్ నియామకం.



చౌడేపల్లి ఫిబ్రవరి 26 మనం న్యూస్: పుంగనూరు న్యాయస్థానంలో ఏజీపీగా చౌడేపల్లి కి చెందిన బూరగల సురేష్ బాబు నియమితులయ్యారు మండల కేంద్రమైన చౌడేపల్లికి చెందిన ఆయన పుంగనూరు న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు ఆయనను అన్నమయ్య జిల్లా పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ,) గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది సురేష్ బాబు, మూడు సంవత్సరాలు పాటు ఏజీపీగా కొనసాగుతారని ఉత్తర్వులు జారీ చేశారు ఏజీపీగా బాధ్యతలు చేపట్టనున్న ఆయనను స్థానికులు అభినందించారు

## సత్య ప్రమాణాలురాజనాల బండకు దేవరెద్దు వితరణ.



చౌడేపల్లి ఫిబ్రవరి 26 మనం న్యూస్:సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండకు దేవర ఎద్దును పట్టుకున్నారు రాజనాల బండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించిన మూడు దేవతలు ఉన్నాయి ఆ మూడింటిలో ఇటీవల ఒక ఎద్దు మరణించింది దీంతో దిగువపల్లి పంచాయతీ చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న నాటు ఆవులన్నీ కాపునీకుంట వద్దకు చేరవేశారు శాస్త్ర సూక్తంగా ఆవు దూడ ఒకే చోట ఉన్న ఆహారాన్ని భుజించడంతో దానిని దేవరెద్దుగా పరిగణించి దేవుడికి వదిలేశారు మోట్లపల్లికి చెందిన రెడ్డి వారి కృష్ణప్ప ఆవు దూడను దేవుడు నిర్ణయించాడని సాంస్కృతిక కార్యక్రమాల మధ్య తీసుకొని వచ్చారు దేవర ఎద్దు రాజనాల పండుగ తీసుకొచ్చిన ఆనందంలో భక్తులు పలు కార్యక్రమాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## దశాబ్దాల రోడ్డు కష్టాలకు శాశ్వత పరిష్కారం...!

▪ ఐతేపల్లి – రంగంపేట రహదారి విస్తరణ పనులు ప్రారంభం.

▪ ఎమ్మెల్యే పులివర్తి నానికి గ్రామస్తులు కృతజ్ఞతలు.



చంద్రగిరి, ఫిబ్రవరి 26 మనం న్యూస్ : మృత్యుపాశంలా మారిన సింగిల్ రోడ్డుకు విముక్తి. ఐతేపల్లి పంచాయతీ నుంచి రంగంపేట వరకు ఉన్న రహదారి విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇరుకైన సింగిల్ రోడ్డు కారణంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ మార్గాన్ని డబుల్ రోడ్డు గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గత కొన్నేళ్లుగా ప్రమాదకర మలుపులు, రహదారి ఇరుకుదనం కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను గుర్తించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు రహదారి విస్తరణపై ప్రతిపాదనలు స్వయంగా అందజేశారు. విస్తరణ పనులపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేశారు. అవసరమైన పరిపాలనా అనుమతులు పూర్తయ్యాక ఐతేపల్లి బస్టాండ్ వద్ద పనులు ప్రారంభమయ్యాయి. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక రంగంపేట మరియు పరిసర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ప్రమాదాలు తగ్గడంతో పాటు మెరుగైన రవాణా సౌకర్యం ఉంటుందని అధికారులు తెలిపారు. ఐతేపల్లి నుండి రంగంపేట వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేపట్టినందుకు గ్రామస్తులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సైబర్ క్రైమ్స్ కు విడ్స్ సమస్త అవగాహనతో చెక్ ...




పిచ్చాటూరు ఫిబ్రవరి 26 మనం న్యూస్:తిరుపతి జిల్లా నాగలాపురం మండలం ఎస్ ఎస్ పురం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో కేవైసీ,సికేవైసీ,రీకేవైసీ,సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన కల్పించారు ఈ సందర్భంగా యూకో బ్యాంక్ మేనేజర్ విష్ణు కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కేవైసీ రీకేవైసీ చేయించుకోవడం వల్ల ఎలాంటి నిరంతరాయం లేకుండా అకౌంట్ ను కొనసాగించుకోవచ్చు,అదేవిధంగా ఇన్సూరెన్స్ 1.ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన,2.ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన గురించి వివరించారుఅనంతరం ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ క్రాంతి కిరణ్,రామ్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటిపి,ఆధార్ అకౌంట్ నెంబర్ మొదలైన వాటి గురించి అడిగినట్లయితే ఇవ్వకూడదని తెలిపారు సైబర్ క్రైమ్స్,బ్యాంక్ అకౌంట్ కలిగిన ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ వేసుకోవాలన్నారు ఇన్సూరెన్స్ వేసుకున్న వ్యక్తి మరణిస్తే వారి కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కార్తీక్,జానకిరామయ్య,క్రాంతి కుమార్ తరితరులు పాల్గొన్నారు

## జిల్లా కలెక్టర్ ని కలిసిన జనసేన నాయకులు యువరాజు స్వేరో



బంగారుపాలెం చిత్తూర్ ఫిబ్రవరి 26 మనం న్యూస్:చిత్తూరు జిల్లా కలెక్టరు గారిని తవణంపల్లి మండల జనసేన నాయకులు యువరాజు స్వేరో మర్యాద పూర్వకంగా కలిశారు. యువరాజు స్వేరో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా, తవణంపల్లి మండలంలోని ఎ. గొల్లపల్లి గ్రామంలోని బి.సుబ్రమణ్యం అనే అతను పూర్తి వైకల్యంతో బాధపడుతున్నారని అతనికి వెంటనే వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని అలాగే వారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించాలని కోరారన్నారు. అందుకు గౌరవ కలెక్టరు గారు సానుకూలంగా స్పందించారని, మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో యువరాజు స్వేరో, జనసేన నాయకులు చందు, లాలు, హర్ష, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వం – ఇప్పుడే పొందండి!

▪ ప్రజల కోసం – యువత కోసం – మార్పు కోసం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26,మనం న్యూస్: శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ప్రజలు జనసేన పార్టీ యొక్క సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని దీనివలన కలిగే ప్రయోజనాలను పసుపులేటి నవీన్ కుమార్ జనసేన పార్టీ నాయకులు వివరించారు. ముఖ్యంగాఉద్యమి సభ్యునిగా మీరు పార్టీ అధికారిక సభ్యునిగా గౌరవం మరియు గుర్తింపును పొందుతూ, పార్టీ నిర్మాణంలో ప్రత్యేక స్థానం కలుగుతుందని, సభలు, ర్యాలీలు, కార్యక్రమాల్లో ప్రత్యేక ప్రాధాన్యతతో ముందువరుసలో పాల్గొనే అవకాశం లభిస్తుందని,పార్టీ కమిటీల్లో కీలక బాధ్యతలు, నాయకత్వ హోదాలు పొందేందుకు సభ్యత్వం తప్పనిసరి కాబట్టి, నాయకులుగా ఎదిగేందుకు ఇది తొలి మెట్టు గా ఉంటుందని,అదనంగా నాయకత్వ శిక్షణ ద్వారా భవిష్యత్తు నాయకత్వానికి అవసరమైన ప్రొఫెషనల్ మార్గదర్శకత్వం అందుతుందని, అంతేకాకుండా, సభ్యులకు రూ.5,00,000 ప్రమాద బీమా సౌకర్యం ఉండటం వలన మీ కుటుంబానికి భరోసా, భద్రత లభిస్తుందని తెలియజేశారు.ఇప్పుడే మీ సభ్యత్వం నమోదు కోసం మీ సాదక్ క్రియా వాలంటర్ పసుపులేటి నవీన్ కుమార్ ను సంప్రదించాలని తెలియజేశారు.

# తీర్థయాత్రికుల కోసం ప్రత్యేక "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ప్యాకేజీలు



తిరుపతి ఫిబ్రవరి 26:తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేకంగా "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం IRCTC ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి మార్చి 21 నుంచి జూన్ 3, 2026 వరకు మొత్తం నాలుగు ప్రత్యేక ప్యాకేజీ యాత్రలను నిర్వహిస్తున్నట్లు ఐఆర్ సీటీసీ ఏరియా మేనేజర్ ఎన్. అశోక్ కుమార్ తెలిపారు.తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ యాత్రలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.1. దివ్య దక్షిణయాత్ర జ్యోతిర్లింగ దర్శనంయాత్ర లో తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనం ఉంటుంది. యాత్ర కాలం: 21.03.2026 – 28.03.2026 మరియు 24.05.2026 – 31.05.2026 8 రోజులు టికెట్ ధర (ఒక్కొక్కరికి) స్లీపర్ – ₹14,700/–రైలు ప్రయాణ మార్గం:సికింద్రాబాద్ – జనగాం – కాజీపేట – వరంగల్ – మహబూబాబాద్ – ఖమ్మం – మధిర – విజయవాడ – తెనాలి – ఒంగోలు – నెల్లూరు – గూడూరు – రేణిగుంట.2.సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (SCZBG55)ఈ యాత్రలో ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్), ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్, పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గృష్ణేశ్వర్) దర్శనాలు కల్పించబడతాయి.యాత్ర కాలం 11 రోజులు14.04.2026 – 24.04.2026 రైలు ప్రయాణ మార్గం:సికింద్రాబాద్ – కామారెడ్డి – నిజామాబాద్ – ధర్మాబాద్ – ముద్ఖేడ్ – నాందేడ్ – పూర్ణ.3.అయోధ్య – కాశీ – బైద్యనాథ్ ధామ్ దర్శన్ యాత్రఈ ప్యాకేజీలో పూరి, కోణార్క్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య, ప్రయాగ్రాజ్ వంటి పవిత్ర క్షేత్రాల దర్శనం ఉంటుంది. యాత్ర కాలం 8 రోజులు 28.04.2026 – 05.05.2026 మరియు03.06.2026 – 12.06.2026టికెట్ ధర (స్లీపర్) ₹16,700/–రైలు ప్రయాణ మార్గం:సికింద్రాబాద్ – కాజీపేట – వరంగల్ – ఖమ్మం – విజయవాడ – గుడివాడ – భీమవరం – తణుకు – నిడదవోలు – రాజమండ్రి – సామర్లకోట – తుని – దువ్వాడ – పెందుర్తి – విజయనగరం.4 హరిద్వార్ – మాతా వైష్ణోదేవి – రిషికేశ్ యాత్రఈ యాత్రలో మథుర, బృందావనం, మాతా వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేశ్ దర్శనాలు కల్పిస్తారు. యాత్ర కాలం:12.05.2026 – 21.05.2026 టికెట్ ధర (స్లీపర్):

16,500/–రైలు ప్రయాణ మార్గం సికింద్రాబాద్ – జనగాం – కాజీపేట – పెద్దపల్లి – మంచిర్యాల – బెల్లంపల్లి – సిర్పూర్ కాగజ్ నగర్ – బల్హార్షా – వార్ధా – నాగ్ పూర్. ముఖ్యంగాయాత్ర ప్యాకేజీలో కల్పించే సౌకర్యాలు.ఈ ప్యాకేజీలో రైలు ప్రయాణం, బస్సు రవాణా, హోటల్ వసతి, రోజుకు మూడు భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలు అందిస్తారు.

దర్శన స్థలాలకు ఉచిత రవాణా, ప్రయాణ బీమా, రైళ్లలో సీసీటీవీ కెమెరాలు, ప్రతి కోచ్ కు సెక్యూరిటీ గార్డ్ ఏర్పాటు చేస్తారు. ఒక్కో రైలులో 705 మంది ప్రయాణికులు ఉండగా, ప్రతి 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లను నియమిస్తారు. టికెట్ బుకింగ్ వివరాలఫోన్ నంబర్లు: 9281495853, 828793231 వెబ్ సైట్:www.irctctourism.com ఈ కార్యక్రమంలో ఐఆర్ సీటీసీ టూరిజం ఏరియా మేనేజర్ ఎన్ అశోక్ కుమార్, జి మురళి, పవన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగడి కోసం నకిలీ పత్రాలతో తప్పుడు ఆరోపణలు

- ఉద్దేశ్య పూర్వకంగానే నన్ను రోడ్డుకు లాగుతూంది
- క్రాంతి కుమార్ ఆవేదన



తిరుపతి ప్రెస్ క్లబ్ ఫిబ్రవరి 26 మనం న్యూస్ : తిరుమల కొండపై ఉన్న అంగడి కోసం నకిలీ పత్రాలు సృష్టించి నాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ నన్ను రోడ్డుకు లాగే ప్రయత్నం చేస్తున్నదని భర్త క్రాంతి కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశంలో కుటుంభ సభ్యులతో కలిసి మాట్లాడుతూ గంగజానకి కి కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో నేను ఆమెకు అండగా నిలిచి,2014లో ప్రేమ వివాహం చేసుకున్నానని,మాకు 2018 లో ఒక పాప పుట్టిందని, నా నుంచి విడిపోయి ఇప్పుడు నకిలీ పత్రాలు సృష్టించి తమకు వారసత్వంగా వచ్చే దుకాణాన్ని స్వాధీనం చేసుకోవాలనే నేపథ్యంలో నకిలీ పత్రాలు సృష్టించి మోసానికి పాల్పడుతుందని ఆరోపించారు.పెళ్లయిన కొన్నాళ్ల తర్వాత ఆమెకు హైదరాబాదుకు చెందిన హజరత్ రెడ్డి అనే వ్యక్తితో నాకు ముందు వివాహం జరిగినట్లు తెలుసుకొని విడిపోయామని చెప్పారు. ఆమె చేసిన మోసాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం చేయగా, ఒక నెల రోజులపాటు శ్రీ హాస్పిటల్ నందు ట్రీట్మెంట్ తీసుకున్నానని చెప్పారు. తిరుమలలో ఉన్న షాపు మాకు పూర్వికులు నుండి వచ్చిన ఆస్తి అని,ఆస్తిపై ఆమె తప్పుడు ప్రచారాలు చేస్తూ, ఫేక్ డాక్యుమెంట్ లతో మమ్మల్ని వేధిస్తుందని, ఆమెకు ఈ ఆస్తిలో ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు.కె గంగా జానకి తన తండ్రి సుబ్బారావు రాజమండ్రి కు చెందిన వ్యక్తి అన్నారని,అలాంటి వ్యక్తికి తిరుమలలో దుకాణం ఎలా వస్తుందని ప్రశ్నించారు. గతంలో గంగా జానకి తిరుమలలో ఏ అడ్రస్ పైన నివాసం ఉందో చెప్పాలని కోరారు.తన వారసత్వపు ఆస్తిని కాజేసేందుకు కొందరు వ్యక్తులతో కలిసి తనపై లేని పోనీ ఆరోపణలు చేస్తూ నన్ను మానసికాంగా ఇబ్బంది పెడుతుందని చెప్పారు. తప్పుడు పత్రాలతో మమ్మల్ని ఇబ్బంది పెడుతూ, మోసాలకు పాల్పడుతున్న గంగా జానకి పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని,దీనిపై తిరుమల పోలీసు అధికారులు,అలాగే టిటిడి రెవిన్యూ విభాగం స్పందించి పూర్తి విచారణ చేసి తగు న్యాయం చెయ్యాలని క్రాంతి కుమార్ కోరారు.

# యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తుంటి సుధాకర్ యాదవ్

- ప్రభుత్వం యాదవులను ఆదుకోవాలి
- ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ యాదవ్
- సంఘం నాయకులను సన్మానించిన సునీల్ యాదవ్



తిరుపతి ప్రెస్ క్లబ్ ఫిబ్రవరి 26 మనం న్యూస్ : తిరుమలలో యాదవులకున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని,తిరుపతి స్థానికులుగా ఉన్నటువంటి తుంటి సుధా యాదవ్ ను రాష్ట్ర యాదవ సంఘం కార్యదర్శిగా కమిటీ ఎన్నుకోవడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ యాదవ్ గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ సాక్షాత్తు అన్నమాచార్యుల ప్రసంశలు అందుకున్నటు వంటి యాదవ కులంలో పుట్టడం యాదవులు చేసుకున్న అదృష్టమని అన్నారు.ఏ పార్టీ అధికారంలో ఉన్న విద్య, ఉద్యోగ,వ్యాపార,రంగాలలో యాదవులు అనగదొక్కబడుతున్నారని చెప్పారు.రాష్ట్ర విభజన తర్వాత యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని,వైసీపీ ప్రభుత్వం నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా యాదవ కార్పోరేషన్ కి నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు.యాదవ కార్పొరేషనికి 6 వందల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.రాజధాని ప్రాంతంలో 10ఎకరాల స్థలం,100 కోట్ల రూపాయల హాస్టల్ భవన్ నిర్మించి,ప్రతి హెడ్ క్వార్టర్ లో యాదవ భవన్ కు నిధులు మంజూరు చేయాలని కోరారు. వెనుకబడిన యాదవుల కోసం గ్రామీణ ప్రాంతాలలో గొర్రెలు,గేదెలు, ఆవులు,పాల వ్యాపారం చేసుకొనే వారికి ఎటువంటి హామీలు లేని రుణాలు ఇవ్వాలని,లేదంటే తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా పాడి పరిశ్రమ మీద ఆధారపడి బతుకుతున్న వాళ్లకి గొర్రెలు, మేకలు, ఆవులు ప్రభుత్వమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.యాదవ కులస్తులు ముఖ్యంగా ఎమ్మార్వో ఆఫీసులలో, పోలీస్ స్టేషన్లలో ఇబ్బందులకు గురి అవుతున్నారని,వాటిని ఎదుర్కోవడానికి గ్రామ, మండల స్థాయిలో యాదవ కమిటీలు వేసి కమిటీల ద్వారా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.175 నియోజకవర్గాలలో ఎక్కడ ఇబ్బంది వచ్చినా ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం పోరాటం చేస్తుందని, అందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు.తుంటి సుధా యాదవ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చిన కుర్ర శ్రీనివాస్ యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామ మండల స్థాయిలలో కమిటీలు వేసి యాదవ కుల బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని చెప్పారు.ఈ సమావేశంలో చిన్ని యాదవ్, అరుణ్ యాదవ్,శీను యాదవ్,కృష్ణ యాదవ్, హరి యాదవ్,సునీల్ యాదవ్, సురేష్ యాదవ్,నవీన్ యాదవ్,రాఖీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# "ధైర్య స్పర్శ" కార్యక్రమంలో బాగంగా
# అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి, IPS.






- "ధైర్య స్పర్శ" పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ మరియు ట్రైనీ IPS డా.తరుణ్ పహ్వా.

(చిత్తూరు,ఫిబ్రవరి26,మనం న్యూస్): "డ్రగ్స్ ఒద్దు బ్రో" అంటూ నినాదించిన పాఠశాల విద్యార్థులు.★ పోలీసులంటే తప్పు చేసే వారికి భయం ఉండాలి, పిల్లలకు మాత్రం పోలీస్ ఒక స్నేహితుడిగా ఉంటాడు. "బాల్య వివాహాల నివారణ ప్రతి పౌరుడి బాధ్యత - సమాచారం ఇవ్వడం ద్వారా ఒక బాల్యాన్ని కాపాడవచ్చు." తెలియని లింక్ - ప్రమాదానికి ఆహ్వానం. ఆలోచించి క్లిక్ చేయండి. "వేగం పెంచితే ప్రమాదం పెరుగుతుంది, హెల్మెట్ పెడితే జీవితం నిలుస్తుంది."జిల్లా ఎస్పీ తుషార్ డూడి, IPS.ధైర్య స్పర్శ కార్యక్రమంలో బాగంగా ఈరోజు పాలసముద్రం మండలంలోని ఎస్.ఆర్. కండ్రిగ గ్రామంలో ZP హై స్కూల్ నందు సుమారు 700 మంది విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, IPS పాల్గొన్నారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎస్పీ గారికి పాఠశాల విద్యార్థులు బ్యాండ్ ద్వారా ఘన స్వాగతం పలికారు. అనంతరం పాలసముద్రం ఎస్.ఐ. రాజశేఖర్ రెడ్డి ధైర్య స్పర్శ అంటే ఏమిటి అది ఎలా పని చేస్తుంది అని వివరంగా విద్యార్థులకు వివరించారు.తరువాత పాఠశాల విద్యార్థులు "డ్రగ్స్ వాడకం వలన కలిగే నష్టాలు", "రోడ్డు ప్రమాదాలు", "బాల్య వివాహాలు" వంటి వాటి పై అవగాహన కల్పిస్తూ స్కిట్ ల రూపంలో ప్రదర్శించారు.ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి, IPS మాట్లాడుతూమొదటగా స్కిట్ ల ద్వారా విద్యార్థులందరూ చాలా చక్కగా ప్రదర్శించారని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు, ఉపాధ్యాయులు, పోలీసులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తును సరైన దారిలో నడిపిస్తాయని అన్నారు.– క్షణిక ఆనందం కోసం వేగంగా బైక్ నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని, రోడ్డు మీద నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనం నడపాలని సూచించారు.– పొగాకు, గుట్కా, మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం మాత్రమే కాదు, భవిష్యత్తు కూడా నాశనం అవుతుందని చెప్పారు. "Say No To Drugs" అంటూ పిల్లలతో కలిసి నినాదాలు చేయించారు. పోలీస్ అంటే తప్పు చేసినవారికి భయం ఉండాలని, పిల్లలకు మాత్రం పోలీస్ ఒక స్నేహితుడిగా ఉండాలని స్పష్టం చేశారు. మీకు ఏదైనా సమస్య ఉంటే భయపడకుండా మీ ఉపాధ్యాయులకు చెప్పాలని, వారు పోలీసులకు తెలియజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాల్య వివాహాలపై మాట్లాడుతూ, అది చట్ట విరుద్ధమే కాకుండా మీ జీవితానికే కాదు, రాబోయే తరాల భవిష్యత్తుకూ పెద్ద సమస్యగా మారుతుందని తెలిపారు. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్ వినియోగం వంటి అంశాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రోన్ ఫ్లైయింగ్ గురించి విద్యార్థులతో ముచ్చటిస్తూ, భవిష్యత్తులో మీకు డ్రోన్ వినియోగించడం నేర్పిస్తామని, అయితే అందుకు ముందుగా బాగా చదవాలి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

అనంతరం కార్యక్రమం ఉద్దేశించి ASP డా.తరుణ్ పహ్వా, IPS మాట్లాడుతూ... పోలీసులు మరియు విద్యార్థుల మధ్య మంచి సంబంధాలు ఉండడం చాలా అవసరమని సూచించారు. విద్యార్థులు పోలీసులను భయపడకుండా స్నేహపూర్వకంగా చూడాలని, అవసరమైనప్పుడు సహాయం కోరాలని తెలిపారు. తమ పాఠశాలలు, కాలనీలు, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చట్ట విరుద్ధ కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు లేదా అనుమానాస్పద విషయాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలా సమాచారం ఇవ్వడం ద్వారా నేరాలను ముందుగానే నివారించవచ్చని చెప్పారు. విద్యార్థుల సహకారం పోలీసు శాఖకు బలమని, సమాజ భద్రత అందరి బాధ్యత అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సందర్భంగా "ధైర్య స్పర్శ" పోస్టర్ ను ఎస్పీASP గారు, MEO పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు మరియు పోలీసు అధికారులతో కలిసి ఆవిష్కరించారు.బర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్ అవగాహనపై నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మొమెంటో మరియు సర్టిఫికేట్ లు అందజేశారు. కార్యక్రమంలో కార్వేటినగరం ఇన్స్పెక్టర్ హనుమంతప్ప, ఎస్.బి. ఇన్స్పెక్టర్ మురళీ మోహన్, క్రైమ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, జి.డి.నెల్లూరు ఇన్స్పెక్టర్ ప్రసాద్, పాలసముద్రం ఎస్.ఐ. శ్రీ రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఆర్. పురం ఎస్.ఐ. సుమన్, MEO లు శ్రాజేంద్ర ప్రసాద్, శ్రీమతి గిరిజ, పాఠశాల హెడ్ మిస్ట్రెస్ శ్రీమతి హరిత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు



తిరుమల,ఫిబ్రవరి 26,మనం న్యూస్: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.గురువారం ఉదయం వీఐపీ విరామ సమయంలోతెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్,సినీ నటుడు లారెన్స్,సినీనటి మనిషా శ్రీ వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఎమ్మెల్యే పులివర్తి నానికి రుణపడి ఉంటాం ...! రాజువారిపల్లి గ్రామస్తులు

- రూ.15 లక్షలతో పూర్తయిన తాగునీటి ట్యాంక్ పనులు పరిశీలించిన ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు
- ఎమ్మెల్యే పులివర్తి నానితోనే అభివృద్ధికి మహర్ధశ....క్లస్టర్ ఇన్చార్జ్ కొట్టే శివకుమార్



చిన్నగొట్టిగల్లు ఫిబ్రవరి 26 మనం న్యూస్:చిన్నగొట్టిగల్లు పంచాయతీ రాజువారిపల్లి గ్రామానికి ఉన్న తాగునీటి సమస్యలకు, శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే పులివర్తి నాని కి రుణ పడి ఉంటామని ,రాజుల పల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే సేవలు పై హర్షం వ్యక్తం చేశారు. రాజువారి పల్లి గ్రామానికి మంజూరైన 15 లక్షల రూపాయల తాగునీటి ట్యాంకు పనులను ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ నరేంద్ర, డిఇ శ్రీనివాస్ రెడ్డి, ఏ ఈ కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్చార్జ్ కొట్టే శివకుమార్ లు గురువారం పరిశీలించారు. రాజువారి పల్లి గ్రామస్తులు మునిరత్నం మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రాజువారి పల్లికి వేసవిలో కూడా తాత్కాలికంగా, వాటర్ ట్యాంక్ లను ట్రాక్టర్ల ద్వారా , ప్రజలకు దాహర్తి తీర్చేవారని అన్నారు. అయితే తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారించేలా ఎమ్మెల్యే పులివర్తి నాని,15 లక్షల రూపాయలతో వాటర్ ట్యాంకును మంజూరు చేయడంతో మా గ్రామానికి ఎంతో మేలు జరిగిందని, ఆయనకు ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు.క్లస్టర్ ఇన్చార్జ్ కొట్టే శివ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని తో మండల అభివృద్ధికి మహర్ధశ పట్టిందన్నారు.ప్రజా అభ్యుదయం కోసం ఎమ్మెల్యే పులివర్తి నాని చేస్తున్న కృషిని అభినందిస్తూ,ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మోహన్ కుమార్, చిరంజీవి అంగజాల వెంకీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## చెరకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.



పిచ్చాటూరు ఫిబ్రవరి 26 మనం న్యూస్:నింద్ర నేతమ్ షుగర్స్, బుచ్చినాయుడు కండ్రిగ మయూర షుగర్స్ లు రైతుల ద్వారా తోలుకున్న చెరకు కు బకాయిలు కోట్లాది రూపాయలు ఇవ్వకుండా ఫ్యాక్టరీలు మూసివేశారని, దీంతో ఏడాది పాటు చెరకు పండించిన రైతులు అప్పుల పాలై వీధిన పడ్డారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏపీ అసెంబ్లీలో గళమెత్తారు.ఏళ్ళు గడుస్తున్న రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు మాత్రం ఇవ్వడం లేదని, ప్రభుత్వం చొరవ తీసుకొని రైతుల బకాయిలను ఇప్పించేలా చర్యలు చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకొచ్చారు. పిడుగు పడి మరణించిన కుటుంబాలకు, గుంటలో పడి మరణించిన కుటుంబాలకు, కరెంటు షాక్ తో మృతి చెందిన వారికి, వడదెబ్బతో మరణించిన కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ రాదు అధ్యక్ష..ఇలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 2001 లో తాను జడ్పీటిసి సభ్యునిగా ఉన్న సమయంలో వడదెబ్బతో మరణించిన చాలా కుటుంబాలకు మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ద్వారా ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అలాగే సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ మండలం లోని మయూర షుగర్ ఫ్యాక్టరీ, నింద్ర నేతం షుగర్ ఫ్యాక్టరీ లు చెరకు తోలిన రైతులకు డబ్బులు ఇవ్వకుండా బకాయిలు పెట్టి రెండు ఫ్యాక్టరీలు కూడా మూసివేశారన్నారు. ఏడాది పాటు పంట పండించిన చెరకు రైతు అప్పుల పాలై వీధిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను ఇప్పటికే గౌరవ ముఖ్యమంత్రి గారికి విన్నవించామని, రైతుల బకాయిలను ఫ్యాక్టరీలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సభలో విజ్ఞప్తి చేశారు.

## శ్రీకాళహస్తి నారాయణ పాఠశాలలో 'కహానియన్ క క్యారవన్' కథల పోటీలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26, మనం న్యూస్:శ్రీకాళహస్తి పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో 'కహానియన్ క క్యారవన్' పేరుతో కథల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నర్సరీ నుండి PP2 తరగతుల వరకు మొత్తం 42 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే వేదికపై నిలబడి కథలు చెప్పడం ద్వారా వారు తమ ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్నారు. నీతికథలు, జంతువుల కథలు మరియు చిన్న చిన్న ప్రేరణాత్మక కథలను ముద్దుగా వినిపిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. కథ చెప్పే తీరు, భావ వ్యక్తీకరణ, ఉచ్చారణ మరియు ధైర్యసాహసాలను ప్రమాణాలుగా తీసుకుని న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో వాక్చాతుర్యం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం నందు తల్లిదండ్రులతో పాటుగా ఏజిఎమ్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ చూడామణి, ఆర్.ఐ కిరణ్ మరియు ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ మఫ్రీన్, టీచర్లు సింధూజ, మల్లిక, ప్రభావతి, అరుణ, వెంకటలక్ష్మి, చందన, మమతలు పాల్గొని విద్యార్థులకు ప్రశంసలను తెలియచేశారు.